ఉత్తరం కాకతీయ

TG TEL/25/A1234

www.kakatiyanews.com

గురువారం 06 ఆగస్టు 2026 | సంపుటి - 01 సంచిక - 358 | పేజీలు - 6 వెల - 5




# తెలంగాణ జల హక్కులపై కుట్ర

- జీఆర్ఎంబీ ఎజెండాలో ప్రాజెక్టుల అనుమతుల రద్దు
- ప్రభుత్వం మౌనం వీడి వెంటనే స్పందించాలి
- తెలంగాణ నీటి హక్కులపై రాజీపడే ప్రసక్తే లేదు
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

2లో..




**మిల్లుల్లో కనిపించని ప్రభుత్వ ధాన్యం**

**విజిలెన్స్ అధికారులతో తనిఖీలతో మిల్లర్ల మాయాజాలం బట్టబయలు**

**15 జిల్లాల్లో 50కిపైగా రైస్ మిల్లుల్లో విజిలెన్స్ సంచలన గుర్తింపులు**

**90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం గల్లంతు.. రూ.500 కోట్ల కుంభకోణం వెలుగులోకి**

**జగిత్యాలలోనే రూ.87.89 కోట్ల ప్రభుత్వ ధాన్యం మాయం**

**కేసులు నమోదు.. రూ.300 కోట్ల రికవరీ.. మిగతాపై ఉక్కుపాదం**

**ఆస్తుల జప్తు, బ్లాక్‌లిస్ట్‌కు సర్కార్ సిద్ధం.. మిల్లర్లలో గుబులు**

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ప్రతి ధాన్యపు గింజ చివరకు ప్రజలకు బియ్యంగా చేరాల్సిందే. కానీ ఆ ధాన్యాన్నే కొందరు రైస్ మిల్లర్లు కోట్ల రూపాయల వ్యాపారంగా మార్చుకున్నట్లు విజిలెన్స్ దర్యాప్తు బట్టబయలు చేసింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పేరుతో ప్రభుత్వ గోదాముల నుంచి తీసుకున్న ధాన్యాన్ని బియ్యంగా తిరిగి ఇవ్వకుండా బహిరంగ మార్కెట్‌కు తరలించి అక్రమ లాభాలు ఆర్జించిన భారీ నెట్‌వర్క్ రాష్ట్రవ్యాప్తంగా పనిచేసినట్లు అధికారులు గుర్తించారు. 15 జిల్లాల్లో 50కుపైగా రైస్ మిల్లుల్లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో దాదాపు 90 వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం గల్లంతైనట్లు తేలింది. దీని విలువ సుమారు రూ.500 కోట్లకు చేరుతుందని విజిలెన్స్ అధికారులు అంచనా వేస్తున్నారు. కేసులు నమోదు చేసి, ఆస్తుల జప్తు వరకు వెళ్లేందుకు ప్రభుత్వం సిద్ధమవడంతో రైస్ మిల్లర్లలో తీవ్ర కలకలం నెలకొంది. ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి, దానిని రైస్ మిల్లులకు అప్పగిస్తుంది. మిల్లింగ్ అనంతరం నిర్దేశిత పరిమాణంలో సీఎంఆర్‌ను ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ విచారణలో బయటపడిన అంశాల ప్రకారం... కొందరు మిల్లర్లు ధాన్యాన్ని మిల్లింగ్ చేయకుండా నేరుగా మార్కెట్‌లో విక్రయించి, ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా భారీగా డిఫాల్ట్ అయినట్లు తేలింది. రికార్డుల్లో ఒక లెక్క... గోదాముల్లో మరో లెక్క కనిపించడంతో విజిలెన్స్ అధికారులు లోతైన దర్యాప్తు చేపట్టగా భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.

**జగిత్యాలే దందాకు కేంద్రబిందువా..?**

ఈ కుంభకోణంలో జగిత్యాల జిల్లా అత్యంత కీలకంగా మారింది. తక్కళ్లపల్లి ........తరువాయి 2లో

## మెటాకు కేంద్రం క్లాస్

**మోదీ పోస్టు వివాదంపై కఠిన వైఖరి**

**అశ్వినీ వైష్ణవ్‌తో మెటా గ్లోబల్ బృందం కీలక భేటీ**

**అల్గారిథమ్, కంటెంట్ నిర్వహణపై కేంద్రం ప్రశ్నల వర్షం**

**ప్రజాప్రతినిధుల పోస్టులకు అదనపు భద్రత కల్పిస్తామని మెటా హామీ**

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీకి సంబంధించిన ఫేస్‌బుక్ పోస్టు తొలగింపు వివాదాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ అంశంపై మెటా గ్లోబల్ ప్రతినిధులతో కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కీలక సమావేశం నిర్వహించారు. పోస్టు తొలగింపుకు గల కారణాలపై వివరణ కోరడంతో పాటు, సోషల్ మీడియా వేదికల బాధ్యతలు, కంటెంట్ నిర్వహణ, అల్గారిథమ్ పనితీరుపై కేంద్రం స్పష్టమైన సమాధానాలు కోరినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. సమావేశంలో చిన్నారుల లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, డీప్‌ఫేక్‌లు, కంటెంట్ నిర్వహణలో జరిగిన లోపాలపై మెటా ప్రతినిధులు విచారం వ్యక్తం చేసినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా అదనపు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**'ఇంటర్మీడియరీ' హోదాపై కేంద్రం స్పష్టీకరణ**

భారత చట్టాల ప్రకారం సోషల్ మీడియా సంస్థల బాధ్యతలను కేంద్రం మరోసారి మెటాకు వివరించినట్లు సమాచారం. ఏ కంటెంట్‌ను ఎవరికి చూపించాలనే విషయంలో సంస్థ స్వయంగా నిర్ణయాలు తీసుకుంటున్నందున తమను పూర్తిగా 'ఇంటర్మీడియరీ'గా పరిగణించలేమని, అలాంటి పరిస్థితుల్లో సమాచార సాంకేతిక చట్టంలోని 'సేఫ్ హార్బర్' రక్షణ కూడా వర్తించదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. మెటా గ్లోబల్ అఫైర్స్ అధికారి జోయెల్ ....తరువాయి 2లో




## తుమ్మిడిహెట్టిపై కదలిక



**బ్యారేజీ ఎత్తు పెంపునకు సహకరించండి**

**ప్రతిపాదనలకు మహారాష్ట్రను ఒప్పించాలి**

**కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ**

**మహారాష్ట్రతో చర్చలకు గ్రీన్‌సిగ్నల్.. ముందుగా అధికారుల సమావేశం**

**ఆపై రెండు రాష్ట్రాల మంత్రుల భేటీకి మ్యాప్**

**పాలమూరు-రంగారెడ్డి సహా నాలుగు ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు కోరిన సీఎం**

**సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి**

కాకతీయ, తెలంగాణ బ్యూరో: తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపెండింగ్ అంశాల పరిష్కారానికి కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, కేంద్ర అటవీ-పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌లతో విడివిడిగా సమావేశమై తుమ్మిడిహెట్టి బ్యారేజీతో పాటు పలు కీలక ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర అనుమతి ఇప్పించేందుకు కేంద్రం చొరవ చూపాలని కోరగా, ఈఅంశంపై తెలంగాణ-మహారాష్ట్రల మధ్య చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్ర జల్‌శక్తి మంత్రి హామీ ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో జరిగిన సమావేశంలో సీఎంరేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ ప్రాజెక్టుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానిపై ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్‌శక్తి శాఖకు పంపిన సమాచారాన్ని కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య 148మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి ఒప్పం దం కుదిరిందని గుర్తు చేసిన సీఎం... ప్రస్తుతం 150 నుంచి152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారానే ....తరువాయి 2లో

## బట్ట కాల్చి మీద వేయడమే హరీశ్ రావు పని

- ముందు కాళేశ్వరం ముడుపుల లెక్క చెప్పాలి
- ఏపీతో కుమ్మక్కై ఇప్పుడు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు
- తెలంగాణ నీటి ప్రయోజనాలపై బీఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారం
- నెలాఖరులో సమ్మక్క సాగర్‌కు ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్ఓసీ
- రాష్ట్ర ప్రయోజనాలపై సంక్షేమం, అభివృద్ధిపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదు
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజం



కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు పూర్తిగా అవాస్తవాలని, కట్టు కథలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "తప్పుడు ప్రచారం మానుకోండి... కట్టు కథలతో బట్ట కాల్చి మీద వేయడమే హరీశ్ రావు పని" అని ఆయన ధ్వజమెత్తారు. తొలుత కాళేశ్వరం ప్రాజెక్టు ముడుపుల వ్యవహారంపై సమాధానం చెప్పాలని, ఆ తర్వాత ప్రభుత్వంపై విమర్శలు చేయాలని సవాల్ విసిరారు. హైదరాబాద్‌లో బుధవారం మీడియాతో మాట్లాడిన మంత్రి... ఏపీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా ప్రతి జీఆర్ఎంబీ సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూనే వస్తోందని, ........తరువాయి 2లో

## పోలీస్ కస్టడీకి ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

- రెండు రోజుల విచారణకు కోర్టు అనుమతి
- ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో కీలక ప్రశ్నలు

3లో..



## సీఎంకు ఫోర్జరీలు కనిపించడం లేదా?

- ముఖ్యమంత్రి సొంత విద్యాశాఖలోనే అవినీతి
- హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసిన చర్యలేవీ..?
- ఫిర్యాదు చేసినా పోలీసులు ఎందుకు చర్యలు లేవు..?
- కాంగ్రెస్ పాలనలో ఫేక్ ఎన్‌ఓసీలతో అక్రమ అనుమతులు
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



కాకతీయ,తెలంగాణ బ్యూరో : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిరోజూ 18 గంటల పాటు సమీక్షలు నిర్వహిస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఆయన సొంత శాఖ అయిన విద్యాశాఖలో జరుగుతున్న అవినీతి, ఫోర్జరీలు అధికారులకు కనిపించడం లేదా అని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కొన్ని జూనియర్ కాలేజీలు అక్రమంగా ఫైర్ ఎన్ఓసీ సర్టిఫికెట్లు పొందడంతో పాటు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ నుంచి అనుమతులు కూడా తీసుకున్నాయని ఆరోపించారు. ఎక్స్ వేదికగా విడుదల చేసిన వీడియోలో మాట్లాడిన ఆయన, ఫిబ్రవరిలో ఫైర్ ఎన్ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్న జూనియర్ కాలేజీలే హైడ్రా కమిషనర్ సంతకాన్ని నకిలీ చేసి అనుమతులు పొందినా, విద్యాశాఖ, హైడ్రా, పోలీసు అధికారులు గుర్తించలేకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని విమర్శించారు.

**హైడ్రా ఫిర్యాదు చేసినా చర్యలేవి..?**

ఈ వ్యవహారంపై హైడ్రా అధికారులు లేక్‌వ్యూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు ....తరువాయి 2లో






మంగళవారం రాత్రి మణుగూరు పోలీసులు పట్టుకున్న జీరో ఇసుక లారీ,ఎలాంటి అనుమతుల్లేకుండానే గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్న దృశ్యం

## మణుగూరులో అనధికార ఇసుక ర్యాంపులు

**రైతు లేని గ్రామానికి ఇసుక ర్యాంపులు ఎలా...?**

**సింగరేణి భూముల్లో ఇసుక మాఫియా తవ్వకాలు**

**టీజీఎండీసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు వాటాలున్నాయని ఆరోపణలు**

**కలెక్టర్ ను నమ్మించి ప్రభుత్వ ఖజానా పక్కదారి**

**జీవో ఉల్లంఘించి ర్యాంపులకు గ్రీన్ సిగ్నల్**

**బయట వ్యక్తుల పేరుతో నకిలీ సొసైటీలు**

**నిత్యం వందల లారీలు - ప్రభుత్వ ఖజానాకు భారీ గండి**

**అర్ధరాత్రులు జీరో లారీల దందా**

**ఉన్నతాధికారులు ఉన్నట్టా..లేనట్టా అని ప్రజల ఆగ్రహం**

5లో..

## ఎంజీఎంలో ఇదేం పచ్చదనం..?

4లో..




## డయల్ 112తో అన్ని అత్యవసర సేవలు

- తెలంగాణలో ఏకీకృత అత్యవసర స్పందన వ్యవస్థ ప్రారంభం
- పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు ఇక ఒకే నంబర్
- కృత్రిమ మేధతో వేగవంతమైన స్పందనకు శ్రీకారం





డయల్ 112 అన్ని అత్యవసర సేవలను పరిశీలిస్తున్న డీజీపీ సీవీ ఆనంద్, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



# సీఎంఆర్‌లో కోట్ల దందా..!

(మొదటి పేజీ తరువాయి)

శివారులోని మూడు రైస్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 34,388 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం గల్లంతైనట్లు నిర్ధారించారు. దీని విలువ రూ.87.89 కోట్లు. శ్రీ అభయాంజనేయ స్వామి ఇండస్ట్రీస్లో రూ.43.72 కోట్ల విలువైన ధాన్యం, శ్రీ లక్ష్మీ బాలాజీ ఇండస్ట్రీస్లో రూ.38.68 కోట్ల విలువైన ధాన్యం, శ్రీ లక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్లో రూ.5.48 కోట్ల విలువైన ధాన్యం కనిపించకుండా పోయినట్లు విజిలెన్స్ నివేదిక పేర్కొంది. ఈ నివేదిక ఆధారంగా సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఒక్క జిల్లాలోనే ఈ స్థాయిలో అక్రమాలు బయటపడటంతో... మిగిలిన జిల్లాల్లో పరిస్థితి ఎలా ఉందన్న అనుమానాలు అధికార వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం మార్గదర్శకాలను ఉల్లంఘించిన ప్రతి మిల్లును తనిఖీ చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### ఒక్కో జిల్లాలో ఒక్కో మోడల్...

జగిత్యాలతో పాటు నిజామాబాద్, కామారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లోనూ ఇదే తరహా అక్రమాలు వెలుగుచూశాయి. నిజామాబాద్ జిల్లాలో ఒక రైస్ మిల్లు ప్రభుత్వానికి అప్పగించాల్సిన 2.03 లక్షల క్వింటాళ్ల సీఎంఆర్ ఇవ్వకపోవడంతో జరిమానాలు, వడ్డీలతో కలిపి రూ.68 కోట్ల డిఫాల్ట్ కేసు నమోదైంది. మరో మిల్లు 64 వేల క్వింటాళ్ల ధాన్యం ఇవ్వకపోవడంతో రూ.23 కోట్ల కేసు నమోదైంది. కామారెడ్డి జిల్లాలోని గురు రాఘవేంద్ర రైస్ మిల్లులో 31 వేల క్వింటాళ్ల ధాన్యం గల్లంతైనట్లు అధికారులు గుర్తించారు. దీని విలువ సుమారు రూ.7.5 కోట్లు. సూర్యాపేట జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రైస్ మిల్లర్లపై సీఎంఆర్ నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు కావడం ఈ వ్యవహారం ఎంత విస్తృతంగా సాగిందో సూచిస్తోంది.

### విజిలెన్స్ దాడులతో మొదలైన రికవరీ..

విజిలెన్స్ దాడులు, క్రిమినల్ కేసుల తర్వాత మిల్లర్లలో ఒక్కసారిగా భయం మొదలైంది. నోటీసులు అందుకున్న పలువురు బకాయిల చెల్లింపులకు ముందుకొచ్చారు. ఇప్పటివరకు ప్రభుత్వం సుమారు రూ.300 కోట్ల మేర రికవరీ చేసినట్లు అధికారిక సమాచారం. అయితే ఇంకా వందల కోట్ల విలువైన ధాన్యం, బకాయిల వసూలు పెండింగ్‌లోనే ఉంది. ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని సాధారణ డిఫాల్ట్‌గా కాకుండా ప్రజాధన దోపిడీగా పరిగణిస్తోంది. అందుకే అవసరమైతే ఆర్ఆర్ యాక్ట్, పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తోంది. పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో రికవరీ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రభుత్వ ధాన్యం ఒక్క గింజ కూడా దుర్వినియోగం కాకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రజా ధనాన్ని ఎగ్గొట్టిన వారి ఆస్తులను జప్తు చేయడానికైనా వెనుకాడవద్దని, బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను శాశ్వతంగా బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. విజిలెన్స్ విచారణ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో... ప్రస్తుతం బయటపడినవి కేవలం తొలి దశ అక్రమాలేనా? ఇంకా ఎన్ని జిల్లాల్లో ఇదే తరహా దందా సాగింది? అధికారులు, మధ్యవర్తుల పాత్ర ఏమైనా ఉందా? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. సీఎంఆర్ పేరుతో ప్రభుత్వ ధాన్యాన్ని మాయం చేసిన ఈ కుంభకోణంలో దర్యాప్తు మరింత లోతుగా సాగితే ఇంకెన్ని సంచలనాలు వెలుగుచూస్తాయోనన్న ఉత్కంఠ రాష్ట్రవ్యాప్తంగా నెలకొంది.

# సీఎంకు ఫోర్జరీలు కనిపించడం లేదా?'

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోలేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికారులు, కాలేజీ యాజమాన్యాలు కలిసి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. విద్యాశాఖ, హోంశాఖ, మున్సిపల్ శాఖలకు బాధ్యత వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయా శాఖల్లో జరుగుతున్న ఫోర్జరీలు, అవినీతిని అరికట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. క్షుద్రపూజలు, తాంత్రిక పూజలపై స్క్రిప్టులు సిద్ధం చేయించడంకన్నా, ఫోర్జరీలు, అవినీతికి పాల్పడుతున్న వారిని పట్టుకునేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

### అక్రమ అనుమతులపై చర్యలు తీసుకోవాలి

పోలీసులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తదితర బీఆర్ఎస్ నేతలపై ఎన్ని కేసులు పెట్టారనే అంశాలపై దృష్టి పెట్టడం మానేసి, ఫోర్జరీలు, అక్రమ అనుమతులు, అవినీతి వ్యవహారాలపై చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. సరైన అనుమతులు లేకుండా జూనియర్ కాలేజీలు నిర్వహిస్తే భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగి విద్యార్థులకు ఇబ్బందులు ఎదురైతే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు, హైడ్రా, పోలీసులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ఫోర్జరీ, అవినీతి అక్రమాల్లో ప్రమేయం ఉన్న అధికారులు, కాలేజీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకుంటారో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

# మెటాకు కేంద్రం క్లాస్

(మొదటి పేజీ తరువాయి)

కాప్లన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు. అనంతరం వారు ఐటీ శాఖ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో కూడా ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

### అల్గారిథమ్‌పై వివరణ కోరిన ప్రభుత్వం

ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి చేసిన వీడియో సందేశం ఫేస్‌బుక్‌లో తొలగించబడిన ఘటనపై కేంద్రం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీనిని సాంకేతిక లోపంగా మెటా వివరించినప్పటికీ ఆ వివరణ సంతృప్తికరంగా లేదని ప్రభుత్వం అభిప్రాయపడింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారుల లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, డీప్‌ఫేక్‌ల నియంత్రణ, అల్గారిథమ్ పనితీరు, కంటెంట్‌కు ప్రాధాన్యత కల్పించే విధానం, అల్గారిథమిక్ పక్షపాతం వంటి అంశాలపై కూడా కేంద్రం వివరణ కోరింది. ప్రజాప్రతినిధులు, ధ్రువీకరించిన ఖాతాల పోస్టులపై ఇకపై అదనపు భద్రతా వ్యవస్థ అమల్లోకి తీసుకొచ్చినట్లు మెటా కేంద్రానికి తెలిపినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ పోస్టు తొలగింపు వ్యవహారంపై పార్లమెంటు కమిటీ కూడా తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే ఈ అంశంపై ఇప్పటివరకు మెటా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

# డయల్ 112తో అన్ని అత్యవసర సేవలు

- తెలంగాణలో ఏకీకృత అత్యవసర స్పందన వ్యవస్థ ప్రారంభం
- పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక సేవలకు ఇక ఒకే నంబర్
- కృత్రిమ మేధతో వేగవంతమైన స్పందనకు శ్రీకారం

కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో అత్యవసర సేవలను మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏకీకృత డయల్ 112 వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు పోలీసులకు 100, అంబులెన్స్‌కు 108, అగ్నిమాపక సేవలకు 101 వంటి వేర్వేరు నంబర్లకు కాల్ చేయాల్సి ఉండగా, ఇకపై అన్ని అత్యవసర సేవలకు ఒకే నంబర్ 112ను ఉపయోగించవచ్చు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఈ నూతన వ్యవస్థను ప్రారంభించారు. డయల్ 112 ద్వారా పోలీసు, అంబులెన్స్, అగ్నిమాపక, మహిళల భద్రత, విపత్తు నిర్వహణ తదితర అత్యవసర సేవలు ఒకే వేదికపై అందుబాటులోకి వచ్చాయి. రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు, గొడవలు, మహిళలపై వేధింపులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే తక్షణమే స్పందించేలా వ్యవస్థను రూపొందించారు.

### కాలర్ వివరాలు గుర్తించి వెంటనే స్పందన

ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కాల్స్‌ను పర్యవేక్షిస్తారు. 112కు ఫోన్ చేసిన వెంటనే కాలర్ వివరాలు, ఉన్న ప్రదేశాన్ని గుర్తించి సమీప పోలీసు బృందం, అంబులెన్స్, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం పంపిస్తారు. దీంతో సహాయక చర్యలు మరింత వేగంగా ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఈ వ్యవస్థలో కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించి అత్యవసర కాల్స్‌కు ప్రాధాన్యత కేటాయించడం, అవసరమైన బృందాలకు వెంటనే సమాచారాన్ని చేరవేయడం వంటి ఆధునిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. భవిష్యత్తులో కృత్రిమ మేధ వినియోగాన్ని మరింత విస్తరించి అత్యవసర సేవల సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలంగాణ పోలీసు శాఖ వెల్లడించింది. డయల్ 112 సేవలు రోజుకు 24 గంటలు, ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వేర్వేరు నంబర్లను గుర్తుంచుకోవాల్సిన అవసరం లేకుండా, ఒకే నంబర్ 112కు కాల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని అధికారులు సూచించారు. ఈ వ్యవస్థతో అత్యవసర సేవల స్పందన సమయం తగ్గడంతో పాటు ప్రజల భద్రత మరింత బలోపేతం కానుంది.

# బట్ట కాల్చి మీద వేయడమే హరీశ్ రావు పని

(మొదటి పేజీ తరువాయి)

అది కొత్త విషయం కాదన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వాటిని సమర్థంగా ఎదుర్కోలేదని ఆరోపించారు.

### 'తొమ్మిదిన్నరేళ్లు ఏం చేశారు..?'

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు జరిగాయని, పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ముందుకు వెళ్లిందని, పట్టిసీమ ఎత్తిపోతల పథకం పూర్తయిందని గుర్తుచేశారు. తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణ ప్రయోజనాలను కాపాడకుండా ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని విమర్శించారు. ఈ నెల 18న జరిగే జీఆర్ఎంబీ సమావేశ అజెండాలో ఉన్న అంశాలు కొత్తవి కాదని, గత సమావేశాల్లోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇదే అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చిందన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం విషయంలో కూడా ఇదే తరహా అభ్యంతరాలు వచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించి జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ దృష్టికి తీసుకెళ్లి 2025 ఏప్రిల్ 24న టీఏసీ అనుమతులు సాధించిందని తెలిపారు.

### 'ఏపీ అభ్యంతరాలను సమర్థంగా తిప్పికొట్టాం'

తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క, చిన్న కాళేశ్వరం, చనాకా-కొరటా, మోదికుంట వాగు, గూడెం లిఫ్ట్ తదితర ఏడు ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వొద్దని ఏపీ ప్రభుత్వం జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, జలశక్తి మంత్రిత్వ శాఖకు వరుసగా లేఖలు రాస్తోందన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అభ్యంతరాన్ని సమర్థంగా తిప్పికొట్టి తెలంగాణ హక్కులను కాపాడిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వమే మూడో జీఆర్ఎంబీ సమావేశంలో రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరిందని, రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కూడా అదే వైఖరి అవలంబించిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరిపి ట్రిబ్యునల్ ఏర్పాటు కాకుండా అడ్డుకుందని పేర్కొన్నారు.

### 'సమ్మక్క సాగర్‌కు నెలాఖరులో ఎన్ఓసీ'

సమ్మక్క సాగర్ ప్రాజెక్టు విషయంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో గత ప్రభుత్వం ఒక్కసారి కూడా చర్చలు జరపలేదని ఉత్తమ్ ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఇప్పటికే మూడు సార్లు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని కలిసి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) ఇవ్వాలని కోరిందన్నారు. ఈ నెలాఖరులో ఎన్ఓసీ ఇస్తామని ఛత్తీస్‌గఢ్ సీఎం హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సీతమ్మ సాగర్-సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు టీఏసీ అనుమతులు సాధించడంతో పాటు 60 టీఎంసీల నీటి కేటాయింపులు కూడా సాధించిందన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ చేయలేని పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపించిందని పేర్కొన్నారు.

### 'సుప్రీంకోర్టులోనూ పోరాటం కొనసాగుతోంది'

పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదన వెలుగులోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రెండు సార్లు, తాను ఏడు సార్లు, ప్రధాన కార్యదర్శి పది సార్లు, ఈఎన్‌సీ 19 సార్లు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ, పీపీఏ అధికారులతో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. న్యాయపరంగా కూడా సుప్రీంకోర్టులో ఒరిజినల్ సూట్, ఇంటర్‌లాక్యుటరీ అప్లికేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. నాలుగు వారాల్లోగా ప్రతివాదులు సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందన్నారు. 2018-2022 మధ్య రాయలసీమ ప్రాంతానికి 200 టీఎంసీల వరద నీటిని తరలించే పనులు జరుగుతున్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించలేదా అని ఉత్తమ్ ప్రశ్నించారు. ఆర్డీఎస్ ఆధునీకరణ విషయంలో ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులను ఒప్పించి ముందుకు వెళ్లామని, బీఆర్ఎస్ హయాంలో అలాంటి ప్రయత్నం ఒక్కటైనా జరిగిందా అని నిలదీశారు. కృష్ణా జలాల వాటా కోసం ట్రిబ్యునల్ ముందు స్వయంగా హాజరై రాష్ట్ర తరఫున బలమైన వాదనలు వినిపిస్తున్నామని చెప్పారు. చివరగా హరీశ్ రావును ఉద్దేశించి... "ముందు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఏపీ కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు అందాయన్న కవిత ఆరోపణలకు సమాధానం చెప్పు. ఆ ముడుపుల్లో నీ వాటా ఎంత? తెలంగాణలో అధికారంలోకి రావడం కష్టమని భావించి ఏపీతో కుమ్మక్కై నాగార్జునసాగర్‌ను వివాదంలోకి నెట్టింది మీరే కాదా? లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ముంచి ఇప్పుడు సిగ్గు లేకుండా రాజకీయాలు చేస్తున్నారా?" అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# తెలంగాణ జలహక్కులపై కుట్ర




**జీఆర్ఎంబీ ఎజెండాలో ప్రాజెక్టుల అనుమతుల రద్దు ప్రతిపాదనలు**

**ప్రభుత్వం మౌనం వీడి వెంటనే స్పందించాలి**

**తెలంగాణ నీటి హక్కులపై రాజీపడే ప్రసక్తే లేదు**

**మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు**

కాకతీయ, తెలంగాణ బ్యూరో : గోదావరి నదీ నిర్వహణ బోర్డు ఈనెల 18న నిర్వహించనున్న సమావేశం ఎజెండా తెలంగాణ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. ఎజెండా విడుదలై ఇన్ని రోజులు గడిచినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. జీఆర్ఎంబీ సమావేశం తెలంగాణ ప్రయోజనాల కోసమా, లేక ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన అంశాలు చూస్తే తెలంగాణ ఆత్మగౌరవం ఉన్న ప్రతి ఒక్కరి రక్తం మరిగిపోతుందని అన్నారు. తెలంగాణ జలహక్కులను దెబ్బతీసే కుట్రలను అడ్డుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

### ఏడు ప్రాజెక్టుల అనుమతులపై కుట్ర

కాళేశ్వరం, చౌటుపల్లి హన్మంతరావు, చిన్న కాళేశ్వరం, చనాకా-కొరటా, మోదికుంట వాగు, కడెం గూడెం లిఫ్ట్, సీతారామ లిఫ్ట్ ప్రాజెక్టులకు ఇప్పటికే లభించిన అనుమతులను పునఃసమీక్షించి నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ జీఆర్ఎంబీ ఎజెండాలో ప్రతిపాదించిందన్నారు. సమ్మక్క బ్యారేజీకి ఇచ్చిన అనుమతులను కూడా రద్దు చేయాలని కోరడం తెలంగాణ ప్రయోజనాలపై ప్రత్యక్ష దాడేనని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం కేంద్రం నుంచి సాధించిన అనుమతులను ఇప్పుడు రద్దు చేసే ప్రయత్నం జరుగుతుంటే తెలంగాణ ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి సాధించలేదని, పైగా గతంలో సాధించిన అనుమతులను కూడా ప్రమాదంలో పడేసిందని విమర్శించారు.

### సమ్మక్క ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం

సమ్మక్క సాగర్‌కు ఇప్పటికే 47 టీఎంసీల నీటి కేటాయింపుతో అనుమతులు లభించాయని, ఇప్పుడు అదే ప్రాజెక్టును అడ్డుకునే కుట్ర జరుగుతోందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ములుగు, వరంగల్‌తో పాటు పలు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందే అవకాశం ఉందని గుర్తుచేశారు. తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల గోదావరి జలాల హక్కును కూడా ఏపీ ప్రశ్నిస్తోందని, ఇది అత్యంత ప్రమాదకర పరిణామమని అన్నారు. జీఆర్ఎంబీకి ఇప్పటికే అనుమతులు పొందిన ప్రాజెక్టులను రద్దు చేసే అధికారం ఎక్కడిదని ప్రశ్నించిన హరీశ్‌రావు, తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న ఈ ఎజెండాను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా ఈ అంశంపై తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుతామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు ఎల్. రమణ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# తుమ్మిడిహెట్టిపై కదలిక..!

(మొదటి పేజీ తరువాయి)

నీటి సరఫరా సాధ్యమవుతుందని, విద్యుత్ వ్యయం గణనీయంగా తగ్గుతుందని వివరించారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ నిర్వహించిన అధ్యయనంలో 148 మీటర్లు, 152 మీటర్ల ఎత్తుల మధ్య ముంపు ప్రభావంలో పెద్దగా తేడా లేదని, ముంపులో సగభాగం నదీగర్భంలోనే పరిమితమవుతుందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఎత్తు పెంపునకు మార్గం సుగమం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### ముందుగా అధికారుల భేటీ.. తర్వాత మంత్రుల సమావేశం

తుమ్మిడిహెట్టి అంశంపై ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిన విషయాన్ని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ప్రస్తావించినట్లు తెలిసింది. ఈ సమస్య పరిష్కారానికి ముందుగా కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రుల సమావేశాన్ని కూడా నిర్వహించి పరస్పర అంగీకారానికి వచ్చేలా ప్రయత్నిస్తామని సీఎం రేవంత్‌రెడ్డికి హామీ ఇచ్చారు.

### పర్యావరణ అనుమతులపై కేంద్రానికి మరో విజ్ఞప్తి

మరోవైపు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో జరిగిన సమావేశంలో పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో అనుమతుల మంజూరుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఇప్పటికే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతల పథకంపై రూ.3,187 కోట్లు, సీతమ్మసాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేసిందని తెలిపారు. పర్యావరణ అనుమతుల జాప్యంతో పనులు నిలిచిపోవడంతో ప్రాజెక్టుల వ్యయం మరింత పెరుగుతోందని, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఈ అంశంపై కూడా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశాల్లో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేమ్ నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం. అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగా ఒక్క సెంటు భూమినీ నిషేధిత జాబితాలో చేర్చలేదు

**22ఏ భూములపై మంత్రి పొంగులేటి స్పష్టత**

**45 రోజుల్లో దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారానికి కలెక్టర్లకు ఆదేశాలు**

కాకతీయ,తెలంగాణ బ్యూరో : రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల పేరుతో ఏ అర్హుడికీ అన్యాయం జరగనివ్వబోమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని తెలిపారు. అర్హులైన భూయజమానుల హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ద్వంద్వ లక్ష్యమని పేర్కొన్నారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఖండించారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని, ప్రభుత్వ విధానాన్ని పూర్తిగా అర్థం చేసుకుని అమలు చేయాలని సూచించారు.

### ప్రతి దరఖాస్తుకు 45 రోజుల్లోనే పరిష్కారం

22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచొద్దని మంత్రి అధికారులను ఆదేశించారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా సమగ్రంగా పరిశీలించి హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో వచ్చిన వినతులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు, అక్రమ లావాదేవీలు, ఆక్రమణలు జరగకుండా రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. 22ఏ జాబితాలోని భూములను చట్టబద్ధంగా సమీక్షించి అర్హత ఉన్న భూముల విషయంలో ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తుది నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని జిల్లా కలెక్టర్లు పారదర్శకంగా వినియోగించాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# యువతపై హింసకు హోంమంత్రే బాధ్యుడు

**పేపర్ లీకేజీలపై నిరసన తెలిపిన విద్యార్థులకు కాంగ్రెస్ అండ**

**అమిత్ షాపై రాహుల్ తీవ్ర విమర్శలు**

న్యూఢిల్లీ : పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన చర్యలను కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. నిరసన వ్యక్తం చేసిన యువతపై హింసకు కేంద్ర హోంమంత్రి అమిత్ షానే బాధ్యుడని ఆరోపించారు. జరిగిన ఘటనపై పార్లమెంటులో వివరణ ఇచ్చే ధైర్యం ఆయనకు లేదని విమర్శించారు. పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులను కలిసిన అనంతరం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, రాజ్యాంగాన్ని, భారతదేశ భావనను కాపాడేందుకు యువత పోరాడుతోందని అన్నారు. తమ భవిష్యత్తు కోసం, న్యాయమైన పరీక్షా విధానం కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై దాడులు చేయడం సమర్థనీయం కాదన్నారు. విద్యా వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం నేరం కాదని, లోపభూయిష్టమైన వ్యవస్థను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. నిరసన తెలిపిన విద్యార్థులు తమపై దాడులు జరిగాయని, కొట్టారని, బెదిరించారని తనకు వివరించారని రాహుల్ గాంధీ తెలిపారు. మహిళల ఇళ్లకు గుండాలను పంపడం, బాలికతో బలవంతంగా క్షమాపణ చెప్పించడం వంటి ఘటనలను తీవ్రంగా తప్పుబట్టారు. దేశ భవిష్యత్తు అయిన యువతను గౌరవించి రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.

ఉత్తరం
కాకతీయ
గురువారం 06 ఆగష్టు 2026



# 9న నల్లబెల్లికి కేసీఆర్

**పెద్ది కుటుంబాన్ని పరామర్శించనున్న మాజీ సీఎం**

**9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభలు**



కాకతీయ, నర్సంపేట టౌన్ : దివంగత నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 9న నల్లబెల్లి మండలానికి రానున్నారు. కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేయడంతో పాటు పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజాసేవలను స్మరించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పెద్ది సుదర్శన్ రెడ్డి జ్ఞాపకార్థం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు సంస్మరణ సభలు నిర్వహించనున్నారు. తొలి రోజు జరిగే కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానుండగా, రెండో రోజు మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొని నివాళులర్పించనున్నారు. ఈ కార్యక్రమాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని పార్టీ నాయకులు తెలిపారు. కేసీఆర్ పర్యటన నేపథ్యంలో నల్లబెల్లి, నర్సంపేట ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు విస్తృత ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణానంతరం ఆయన కుటుంబాన్ని స్వయంగా పరామర్శించేందుకు కేసీఆర్ రావడం, అనంతరం రెండు రోజుల పాటు సంస్మరణ సభలు నిర్వహించనున్న నేపథ్యంలో నర్సంపేట నియోజకవర్గ రాజకీయాల్లో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

## డయల్–100కు బదులు 112

**గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే**

**బాధితుల ఫిర్యాదులపై తక్షణ స్పందనకు ఆదేశం**



కాకతీయ, గంభీరావుపేట : అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు డయల్–100 స్థానంలో డయల్–112 ను అమల్లోకి తీసుకొచ్చినట్టు జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే తెలిపారు. బుధవారం గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ వ్యవస్థను పరిశీలించారు. డయల్–112పై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని, బాధితుల ఫిర్యాదులపై జాప్యం లేకుండా స్పందించాలని ఎస్పీ ఆదేశించారు. రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని, గ్రామాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఈ తనిఖీలో సీఐ వెంకటేష్, ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### సోలార్ రూఫ్‌టాప్ పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: మోడల్ సోలార్ విలేజ్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ యూనిట్ల ఏర్పాటును వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం రాయపర్తి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో పనులను పరిశీలించిన ఆమె, మిగిలిన లబ్ధిదారుల ఇళ్లకు అవసరమైన సామగ్రిని వెంటనే అందించి పనులు పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన గృహజ్యోతి వినియోగదారుల ఇళ్లపై ఉచితంగా 2 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీని ద్వారా నెలకు 240–250 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామిరెడ్డి, రెడ్కో డీఎం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### క్విట్ కార్పొరేట్ ఉద్యమాన్ని విజయవంతం చేయాలి



కాకతీయ, చేర్యాల: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో చేపట్టిన 'క్విట్ కార్పొరేట్' ఉద్యమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట మావో పిలుపునిచ్చారు. బుధవారం చేర్యాలలో నిర్వహించిన ప్రజాసంఘాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు రైతులు, కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని విమర్శించారు. గిట్టుబాటు ధర, కనీస వేతనాలు, ఉపాధి హామీ పరిరక్షణ, ఉచిత విద్యుత్ వంటి డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 10న నిర్వహించే జైల్‌భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆముదాల నర్సిరెడ్డి, బియ్య సిద్దులు,నంగిమైసయ్య, జక్కులఎల్లయ్య, ఇప్పకాయలశోభ తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్‌లో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

**జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: లక్ష్మీపురం మార్కెట్‌లో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేసి, చెత్తను ప్రతిరోజూ సకాలంలో తరలించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. బుధవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంకతో కలిసి మార్కెట్‌ను పరిశీలించిన ఆయన, ఘన వ్యర్థాలను ఆలస్యం లేకుండా తరలించి, అవసరమైతే బాలసముద్రం ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ద్వారా డంపింగ్ యార్డుకు పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని, డ్రైనేజీలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్–నాన్‌వెజ్ మార్కెట్ పనులను పరిశీలించి, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి, ఎస్ఈ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కోట మైసమ్మకు మంత్రి కొండా సురేఖ**

# బంగారు బోనం



- వంచనగిరిలో వైభవంగా బోనాల వేడుకలు
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. భారీ ఊరేగింపు

కాకతీయ, గీసుగొండ : వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరి గ్రామంలోని కోట మైసమ్మ అమ్మవారి బోనాల వేడుకలు ఆషాఢ మాసం తొలి బుధవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన స్వగ్రామంలో అమ్మవారికి బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వగృహం నుంచి సంప్రదాయబద్ధంగా బంగారు బోనాన్ని తలపై ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, పోతరాజుల నృత్యాలు, మంగళ వాయిద్యాల నడుమ భారీ ఊరేగింపుగా కోట మైసమ్మ ఆలయానికి చేరుకుని బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని కోట మైసమ్మ తల్లిని ప్రార్థించినట్లు తెలిపారు. సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షిస్తూ ప్రతి ఏడాది స్వగ్రామంలో బోనాల వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. బోనాల ఊరేగింపులో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు రడం భరత్ కుమార్, గోపాల నవీన్ రాజ్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## శిలాఫలకాలకే పరిమితమైన అభివృద్ధి

- గత ప్రభుత్వంపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి విమర్శలు
- వరంగల్ 15, 16, 17 డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కట్టమల్లన్న ఆలయానికి మెరుగైన సౌకర్యాల కల్పనకు హామీ



కాకతీయ, గీసుగొండ : గత ప్రభుత్వంలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా పనిచేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం వరంగల్ మహానగర పాలక సంస్థ 15, 16, 17 డివిజన్లలో శ్రీ కట్టమల్లన్న ఆలయ అభివృద్ధి పనులతో పాటు దూపకుంటలో మహిళా కమ్యూనిటీ భవనం, గాడిపెల్లిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మాజీ మేయర్ గుండు సుధారాణితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కట్టమల్లన్న ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని, ప్రజలు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించాలని కోరారు. రైతు రుణమాఫీ, సన్న వడ్లకు బోనస్, సన్న బియ్యం పంపిణీ, హాస్టల్ విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర రావు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొరియన్ యువతితో మహేష్ మేనల్లుడి నిశ్చితార్థం

- కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా వేడుక
- ఫొటోలను పంచుకున్న నమ్రత
- ప్రత్యేక ఆకర్షణగా రమేష్‌బాబు కుమార్తె భారతి




కాకతీయ, హైదరాబాద్ : సూపర్‌స్టార్ మహేష్‌బాబు కుటుంబంలో పెళ్లి సందడి మొదలైంది. మహేష్‌బాబు మేనల్లుడు, గల్లా జయదేవ్–పద్మావతి దంపతుల చిన్న కుమారుడు సిద్ధార్థ్ గల్లా కొరియన్ యువతి హాయిన్ (జిన్నీ)తో నిశ్చితార్థం చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఆదివారం ఈ వేడుక ఘనంగా జరిగింది. నిశ్చితార్థానికి సంబంధించిన ఫొటోలను మహేష్‌బాబు సతీమణి నమ్రత తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలో మహేష్‌బాబు కుటుంబ సభ్యులతో పాటు ఆయన అక్కలు, దివంగత రమేష్‌బాబు కుమార్తె భారతి పాల్గొన్నారు. ఈ వేడుకలో భారతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సిద్ధార్థ్ గల్లా ప్రస్తుతం కుటుంబ వ్యాపార వ్యవహారాలను చూసుకుంటుండగా, కొంతకాలంగా హాయిన్‌తో ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. రెండు కుటుంబాల అంగీకారంతో వీరి నిశ్చితార్థం జరిగింది. ఈ వేడుకకు సంబంధించిన చిత్రాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇదిలా ఉండగా, సిద్ధార్థ్ సోదరుడు అశోక్ గల్లా హీరోగా నటించిన 'విసా' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. మరోవైపు మహేష్‌బాబు దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## పోలీస్ కస్టడీకి ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి

**రెండు రోజుల విచారణకు కోర్టు అనుమతి**

**ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో కీలక ప్రశ్నలు**



కాకతీయ, హైదరాబాద్ : మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిపై లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్ ఆరోపణల కేసులో నిందితుడిగా ఉన్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిని రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అత్తాపూర్ పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను కోర్టు అనుమతించడంతో గురువారం, శుక్రవారం ఉదయ్ కృష్ణారెడ్డిని ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు విచారించనున్నారు. కస్టడీ విచారణలో కేసుకు సంబంధించిన కీలక అంశాలపై ప్రశ్నించి, అవసరమైన ఆధారాలను సేకరించనున్నట్లు సమాచారం. విచారణ పూర్తయిన అనంతరం నిందితుడిని తిరిగి కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ కేసు గత నెలలో వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తనకు అసభ్యకర సందేశాలు పంపడంతో పాటు సెల్‌ఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలని బెదిరించాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆరోపణలను ఉదయ్ కృష్ణారెడ్డి ఖండిస్తూ తనపై తప్పుడు కేసు నమోదు చేశారని, న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. అనంతరం ఆయన ఆచూకీ లభించకపోవడంతో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టి అరెస్టు చేశాయి. కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ఇప్పుడు పోలీస్ కస్టడీకి అనుమతి లభించడంతో కేసు దర్యాప్తు కీలక దశకు చేరుకుంది.

### సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ : ఎస్పీ

కాకతీయ, ములుగు ప్రతినిధి: డిజిటల్ యుగంలో సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో భాగంగా బుధవారం ములుగులో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన సుమారు 600 మంది విద్యార్థులకు సైబర్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు. కేవైసీ, డీప్‌ఫేక్, డిజిటల్ అరెస్ట్, ఫేక్ లింకులు, పెట్టుబడి పేరుతో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నలువాల రవీందర్, సీఐలు, ఎస్ఐలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే విరాళం

కాకతీయ, కారేపల్లి: పొల్లంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నాగయ్యగుంపు గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ట్రాక్టర్ లోడు ఇటుకలను విరాళంగా అందించారు. గ్రామానికి చెందిన దారావత్ మునినాయక్ విజ్ఞప్తిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఇటుకలను పంపించారు. ఆలయ నిర్మాణానికి అందించిన సహకారంపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భూక్యా రాములు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

### రైతు సమస్యలు వెంటనే పరిష్కరించాలి

కాకతీయ, కారేపల్లి: రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో సింగరేణి మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. వర్షాభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం, ఉచిత విత్తనాలు, ఎరువులు అందించాలని, పాత రుణాలు మాఫీ చేసి వడ్డీలేని కొత్తరుణాలు ఇవ్వాలని, పంటల బీమా అమలు, పశుగ్రాసం, తాగునీరు, సాగునీటి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

### గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం:

**సర్పంచ్ కల్తీ రాధా**

కాకతీయ, గుండాల: ముత్తాపురం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని గ్రామ సర్పంచ్ కల్తీ రాధా పిలుపునిచ్చారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శి కృష్ణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామంలో బ్లీచింగ్ చల్లాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వర్షాల కారణంగా తలెత్తిన సమస్యలను గుర్తించి అధికారులతో సమన్వయం చేసి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### సైబర్ నేరాలపై కేజీబీవీ లో అవగాహన



కాకతీయ,నెల్లికుదురు: మండల కేంద్రం లోని కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయం లో ఎస్ పి శబరీష్ ఆదేశాల మేరకు ఎస్సై చిర్ర రమేష్ బాబు నేతృత్వం లో"సురక్ష జైతిరంగా–సైబర్ స్వతంత్ర తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, మోసపూరిత సందేశాలు, అనుమానాస్పద లింకులు, ఓటీపీ మోసాలు, అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాలు, మొబైల్ ఫోన్ ద్వారా జరిగే ఇతర సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

### కారు–బైక్ ఢీకొని కానిస్టేబుల్ మృతి



కాకతీయ, జనగామ: జనగామ–కొమ్మాల మధ్య టోల్‌గేట్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ ధనుం జయ్ మృతి చెందారు. బైక్‌పై వెళ్తున్న ఆయన ఎదురుగా వచ్చిన కారును ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై ఘటనాస్థలంలోనే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ధనుంజయ్ ఇటీవల వరకు పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించినట్లు తెలిసింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వైద్య కళాశాల పనులు వేగవంతం చేయాలి



కాకతీయ, ఖమ్మం టౌన్: ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెంలో నిర్మాణాలను పరిశీలించిన ఆయన, వైద్య కళాశాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. హాస్టళ్లను సెప్టెంబర్‌లో, అడ్మిన్ బ్లాక్‌ను అక్టోబర్‌లో పూర్తి చేసి, డిసెంబర్ నాటికి అన్ని పనులు ముగించాలని ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి యంగ్ ఇండియా స్కూల్ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

### ప్రేమ వివాహం.. పోలీసులను ఆశ్రయించిన యువజంట



కాకతీయ, కారేపల్లి: ప్రేమ వివాహం చేసుకున్న యువజంట తమకు ప్రాణహాని ఉందంటూ సింగరేణి పోలీసులను ఆశ్రయించింది. సింగరేణి మండలం బీసీ కాలనీకి చెందిన దండు సంజీవ్ (21), ముదిగొండకు చెందిన గాయత్రి (21) ఖమ్మంలోని ఓ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే సమయంలో పరిచయం ఏర్పడి, అనంతరం ప్రేమించి వివాహం చేసుకున్నట్లు తెలిసింది. వివాహం తర్వాత కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఇరు కుటుంబాల సభ్యులతో పోలీసులు మాట్లాడారు. పరిస్థితిని పరిశీలించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపడతామని సింగరేణి ఎస్సై గోపి, సీఐ నునావత్ సాగర్ తెలిపారు.

# ఎంజీఎంలో ఇదేం పచ్చదనం..?

- రోగుల ఆరోగ్యానికి మేలు చేసే మొక్కలా... దోమలకు పుట్టినిల్లా..?
- వార్డుల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలతో పరిశుభ్రతపై ప్రశ్నలు
- రోడ్డుపైనే పడేసిన మాస్కులు.. కిటికీలపై వేలాడుతున్న బెడ్‌షీట్లు, గౌన్లు
- దోమలు, మురుగు, చెత్తతో రోగులు–సహాయకుల ఆందోళన






కాకతీయ, వరంగల్ ప్రతినిధి: రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ వైద్యశాలల్లో ఒకటైన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పరిశుభ్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రోగులకు ఆరోగ్యాన్ని అందించాల్సిన ఆస్పత్రి ఆవరణలోనే అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోందని రోగులు, వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డుల మధ్య ఖాళీ స్థలాల్లో అదుపు లేకుండా పెరిగిన మొక్కలు, పేరుకుపోయిన చెత్త, పలు చోట్ల కనిపిస్తున్న వ్యర్థాలతో దోమలు విస్తరించే పరిస్థితులు నెలకొన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పచ్చదనం పేరుతో పెరిగిన మొక్కలు ఔషధమొక్కలా..? లేక పిచ్చి మొక్కలా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### పచ్చదనమా... నిర్లక్ష్యమా..?

ఆస్పత్రి వార్డుల మధ్య ఖాళీ స్థలాల్లో పెరిగిన మొక్కలు చూడటానికి ఆకర్షణీయంగా కనిపిస్తున్నా, వాటి నిర్వహణ లేకపోవడంతో అవి దోమలకు ఆశ్రయంగా మారే ప్రమాదం ఉందని పలువురు చెబుతున్నారు. వర్షాకాలంలో ఇలాంటి ప్రదేశాల్లో నీరు నిల్వ ఉంటే దోమల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆస్పత్రి యాజమాన్యం క్రమం తప్పకుండా శుభ్రపరిచే చర్యలు చేపడుతున్నదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొన్ని వార్డుల కిటికీలకు వాడేసిన బెడ్‌షీట్లు, గౌన్లు వేలాడుతూ కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల వైద్య వ్యర్థాలు, చెత్త పేరుకుపోయిన దృశ్యాలు కనిపిస్తున్నాయని రోగుల బంధువులు చెబుతున్నారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, మురుగు నీటి పారుదల, చెత్త తొలగింపుపై కూడా యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.







### రోడ్డుపైనే మాస్కులు

ఆస్పత్రి ఆవరణలో ఉపయోగించిన మాస్కులు రోడ్డుపై పడేయడం ఆందోళన కలిగిస్తోంది. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక నిబంధనలు ఉన్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో అమలవుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రికి వచ్చే వేలాది మంది రోగులు, సహాయకులు నడిచే దారుల్లోనే ఇలాంటి వ్యర్థాలు కనిపించడం విమర్శలకు తావిస్తోంది. ఎంజీఎం వంటి అతిపెద్ద ప్రభుత్వ ఆస్పత్రిలో పరిశుభ్రత, దోమల నివారణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక చర్యలు అవసరమని ప్రజలు కోరుతున్నారు. వార్డుల మధ్య పెరిగిన మొక్కలను శాస్త్రీయంగా నిర్వహించడం, చెత్తను వెంటనే తొలగించడం, మురుగు నీరు నిల్వ కాకుండా చూడడం, దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రోగులకు వైద్యం అందించే ఆస్పత్రి పరిసరాలే ఆరోగ్యానికి ముప్పుగా మారకుండా జిల్లా వైద్యాధికారులు, ఆస్పత్రి యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తోంది.

## ఇద్దరు యువకులు డీ-అడిక్షన్ సెంటర్‌కు



కాకతీయ, నెల్లికుదురు: గంజాయి సేవించిన ఇద్దరు యువకులను పట్టుకుని కోర్టు ఆదేశాల మేరకు డీ–అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు ఎస్సై చిర్ర రమేష్‌బాబు తెలిపారు. బుధవారం దుర్గాభవాని తండా క్రాస్‌రోడ్డు సమీపంలోని ఐకేపీ కేంద్రంలో ఇద్దరు యువకులు గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి నిర్వహించారు. దిడ్డి కార్తీక్ (ఆలేరు), బాదావత్ మోహన్ (కేవుల తండా)లను అదుపులోకి తీసుకుని గంజాయి టెస్ట్ కిట్‌తో పరీక్షించగా పాజిటివ్‌గా తేలింది. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి తొర్రూర్ కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు మహబూబాబాద్ డీ–అడిక్షన్ సెంటర్‌కు పంపించారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచి నగదు బహుమతి అందజేస్తామని ఎస్సై తెలిపారు.

## డెంగ్యూపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు

- ప్రతి ఇంట్లో జ్వర సర్వే చేయాలి
- డీఎంహెచ్‌వో డా. బి. రాజారెడ్డి



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : నగరంలోని డాక్టర్స్ కాలనీలో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో నివారణ చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి ఆదేశించారు. బుధవారం డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి ప్రజలకు వైద్య పరీక్షలు, మందుల పంపిణీతో పాటు డెంగ్యూపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిని సందర్శించి జ్వర సర్వే నిర్వహించాలని, లక్షణాలు ఉన్నవారికి వెంటనే పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. యాంటీ లార్వల్ చర్యలు, ఫాగింగ్ చేపట్టడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దేశాయిపేట, చింతల్ యూపీహెచ్‌సీలను సందర్శించి టీకాల నిర్వహణ, రికార్డులు, డెంగ్యూ నివారణ చర్యలను పరిశీలించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, వైరల్ జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా. భరత్ కుమార్, డా. దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అటెండర్ బిక్షపతి మృతికి నివాళి

### కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం



కాకతీయ, ఏటూరునాగారం రూరల్ : ములుగు జిల్లా ఏటూరునాగారం మండల తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న సీహెచ్. బిక్షపతి మృతిపై తహసీల్దార్ జగదీశ్వర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన బిక్షపతి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది తరఫున అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, సహోద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొని బిక్షపతికి నివాళులర్పించారు.

## సైబర్ నేరాల నుంచి విద్యార్థులను రక్షించాలి






- అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులదే కీలక బాధ్యత
- వరంగల్ సీపీ ఎన్. శ్వేత
- వరంగల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేక సదస్సు

కాకతీయ, హనుమకొండ : సైబర్ నేరాల నుంచి విద్యార్థులను రక్షించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. 'సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో భాగంగా బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన సైబర్ అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. సైబర్ నేరగాళ్లు అత్యాశ, భయం, అత్యవసర పరిస్థితులను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని సీపీ తెలిపారు. గుర్తుతెలియని లింకులు, సందేశాలు, ఫొటోలపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలను సామాజిక మాధ్యమాల్లో విచక్షణారహితంగా పంచుకోవద్దని సూచించారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే ప్రైవేట్, పబ్లిక్ జీవితాల మధ్య తేడా, సోషల్ మీడియా వినియోగంపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. సదస్సులో సైబర్ క్రైమ్ అధికారులు తాజా మోసాలపై వివరించగా, పోలీస్ జాగృతి కళాబృందం సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించింది. అనంతరం సైబర్ భద్రత పోస్టర్లను సీపీ ఆవిష్కరించి ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీ దారా కవిత, విద్యాశాఖ అధికారులు, పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం గాలికి.. ప్రజల ఆరోగ్యం ప్రశ్నార్థకం





- రాయపర్తికి చెత్తకుప్పలే స్వాగతం
- ఫాగింగ్ లేదు.. బ్లీచింగ్ పౌడర్ జాడలేదు
- వర్షాకాలంలోనూ నిద్రలోనే పంచాయతీ యంత్రాంగం

కాకతీయ, రాయపర్తి : వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వం పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై గ్రామంలోకి ప్రవేశించే మార్గాల వెంట చెత్తకుప్పలు పేరుకుపోయి ప్రయాణికులకు స్వాగతం పలుకుతున్నాయి. రహదారి పక్కనే కొబ్బరి బొండాల వ్యర్థాలు, ప్లాస్టిక్ సంచులు, కుళ్లిన చెత్తను బహిరంగంగా పారబోస్తున్నా గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ట్రాక్టర్లు, చెత్త సేకరణ వాహనాలు, నిర్వహణ నిధులు కేటాయిస్తున్నప్పటికీ వాటి వినియోగంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సిన వాహనాలు సక్రమంగా తిరగడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రజలు రోడ్ల పక్కనే చెత్తను పారబోయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

### రోగాల భయంతో గ్రామస్తులు

రోడ్లపై పేరుకుపోయిన చెత్త, మురుగుకాలువల్లో నిల్వ నీరు, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా దోమలు విపరీతంగా పెరిగాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. స్థానిక నివాసి పీరని రాజు మాట్లాడుతూ గ్రామంలోని కాలువలు వ్యర్థాలతో నిండిపోవడంతో దోమల బెడద రోజురోజుకూ పెరుగుతోందన్నారు. చెత్త సేకరణ వాహనాలు సక్రమంగా తిరగడం లేదని, పారిశుద్ధ్య చర్యలు పూర్తిగా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి, ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లే పనులను వెంటనే ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## బాధితులకు కాంగ్రెస్ నాయకుల చేయూత



కాకతీయ, హనుమకొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిర్ర రామన్న గౌడ్ రెండు బాధిత కుటుంబాలకు ఆర్థిక, నిత్యావసర సాయం అందజేశారు. పెగడపల్లి గ్రామానికి చెందిన పోలేపాక కుమార్ కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే ముచ్చర్ల గ్రామానికి చెందిన సిర్లంచ విజయ దశదిన కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు రూ.11 వేల ఆర్థిక సాయం చేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని రామన్న గౌడ్ అన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ సంపత్ యాదవ్, బండ దేవేందర్ రెడ్డి, గుడికందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు సంక్షేమానికి కృషి చేయాలి

- నిజాయితీ, పారదర్శకతతో బాధ్యతలు నిర్వర్తించాలి
- ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్
- పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు



కాకతీయ, ములుగు ప్రతినిధి : పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు నిజాయితీ, పారదర్శకతతో బాధ్యతలు నిర్వహిస్తూ పోలీసు అధికారుల సంక్షేమానికి కృషి చేయాలని జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్‌నాథ్ సూచించారు. ఇటీవల ఎన్నికైన అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, కార్యదర్శి, జాయింట్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ట్రెజరర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను ఎస్పీ అభినందించారు. అసోసియేషన్ పోలీసు అధికారుల సంక్షేమం, పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధికి వేదికగా నిలవాలని, అధికారులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా గడ్డం క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్ఐ తాజుద్దీన్, ఎస్ఐ కృష్ణ ప్రసాద్, కార్యదర్శిగా సీఐ దారం సురేష్ కుమార్, జాయింట్ సెక్రటరీగా పసుపులేటి నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ్, ట్రెజరర్‌గా సర్వేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషణ



కాకతీయ, పెద్దవంగర: తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానమని, పుట్టిన తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సర్పంచ్ పర్శరాములు, ఏసీడీపీఓ శోభా అన్నారు. బుధవారం వడ్డే కొత్తపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రసవమైన తొలి గంటలోనే ముర్రుపాలు పట్టించాలని, అవే శిశువుకు తొలి రక్షణగా పనిచేస్తాయని తెలిపారు. తల్లిపాల వల్ల శిశువుల్లో ఇన్‌ఫెక్షన్ల ముప్పు తగ్గడంతో పాటు తల్లుల్లో రొమ్ము, అండాశయ, గర్భాశయ క్యాన్సర్ల ప్రమాదం కూడా తగ్గుతుందని వివరించారు. తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సిహెచ్. మదార్ గౌడ్
- మౌలిక వసతుల మెరుగుదలకు చర్యలు
- వేగవంతం చేయాలని సూచన



కాకతీయ, నెల్లికుదురు : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సిహెచ్. మదార్ గౌడ్ అన్నారు. బుధవారం నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఆయన, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, నాణ్యమైన బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కాలర్‌షిప్‌లు తదితర సంక్షేమ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం కళాశాల మౌలిక వసతులను పరిశీలించిన ఆయన, మైనర్ రిపేర్ పనుల పురోగతిపై ప్రిన్సిపాల్ కె. వీరస్వామిని అడిగి తెలుసుకుని, అవసరమైన మరమ్మతు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ కె. వీరస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు పంపిణీ చేసిన నోట్‌బుక్స్ విద్యాభ్యాసానికి ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అక్రమ ఇసుక ర్యాంపులకు అక్రమ గ్రావెల్ తోలకాలు చేస్తున్న దృశ్యం...




# మణుగూరులో అనధికార ఇసుక ర్యాంపులు

- మణుగూరులో అనధికార ఇసుక ర్యాంపులు
- రైతు లేని గ్రామానికి ఇసుక ర్యాంపులు ఎలా...?
- సింగరేణి భూముల్లో ఇసుక మాఫియా తవ్వకాలు
- టీజీఎండీసీ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు 5%వాటాలున్నాయని ఆరోపణలు
- కలెక్టర్ ను నమ్మించి ప్రభుత్వ ఖజానా పక్కదారి
- జీవో ఉల్లంఘించి ర్యాంపులకు గ్రీన్ సిగ్నల్
- బయట వ్యక్తుల పేరుతో నకిలీ సొసైటీలు
- నిత్యం వందల లారీలు - ప్రభుత్వ ఖజానాకు భారీ గండి
- అర్ధరాత్రులు జీరో లారీల దందా
- ఉన్నతాధికారులు ఉన్నట్టా.. లేనట్టా అని ప్రజల ఆగ్రహం



అక్రమ ఇసుక లోడింగ్ కు ఉన్న ఇసుక లారీల ఫోటో... మణుగూరు ప్రాంతం మొత్తం ఇసుక లారీల వల్ల ట్రాఫిక్ జామ్....



Date: 02/08/2026
Aswapuram

To
The Station House Officer,
Aswapuram Police Station.

Sir,

Sub:- Unauthorised lifting of HBG stone /Soil from the premises of SRLIP Spoil Bank @ KM 8.500

I submit that the SRLIP Spoil Bank from KM 8.500 has been subjected to unauthorised lifting of soil by unknown persons using heavy machine (Tipper No. TG 28 T6489) and JCB-PC-120 without obtaining any permission from the Irrigation Department.

The unauthorised lifting and transportation of soil from spoil bank is causing damage to Government property and also result in loss to Government exchequer and creating law and order issue in the area.

Despite repeated instructions, unauthorised lifting of soil is continuing. Therefore, your immediate intervention is required to prevent further theft of Government property.

In view of above, I request you to kindly,
1. Register a case against persons involved in unauthorised lifting of soil.
2. Stop the illegal excavation & transportation of soil immediately
3. Seize the machinery & vehicles involved
Earlier action in the matter is highly solicited

Yours Sincerely,
[illegible]
S. Praveen Reddy
AEE
Irrigation department

అక్రమ గ్రావెల్ తోలకాలు చేస్తున్నారని సీతారామ ప్రాజెక్టు ఓ అధికారి ఫిర్యాదు చేసిన పత్రం...

**ఒకప్పుడు జనజీవనంతో కళకళలాడిన గుండ్లసింగారం, కొమ్ముగూడెం, శివాజీనగర్ గ్రామాలు... నేడు సింగరేణి గనుల విస్తరణలో భాగంగా చరిత్రలో కలిసిపోయాయి. రెండు నుంచి మూడు దశాబ్దాల క్రితమే ఈ గ్రామాలను పూర్తిగా ఖాళీ చేయించి, ప్రతి ఇంటికి, ప్రతి చెట్టుకు, ప్రతి పుట్టకు పరిహారం చెల్లించి ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం ఆ భూములన్నీ సింగరేణి ఆధీనంలో ఉన్నాయి. ఒక్క ఇల్లు లేదు... ఒక్క రైతు లేడు... ఒక్క ఎకరం సాగు భూమి లేదు. కానీ ఆశ్చర్యకరంగా అదే గ్రామాల పేరుతో నేడు ఇసుక ర్యాంపులు గర్జిస్తున్నాయి. భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. జీవో ప్రకారం గ్రామాలు ఉండాలి... స్థానిక గిరిజనులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ర్యాంపులు మంజూరు కావాలి. అలాంటిది అసలు గ్రామాలే లేని చోట, రైతులే లేని చోట, గిరిజనులే లేని చోట ఇసుక ర్యాంపులకు అనుమతులు ఎలా వచ్చాయన్న ప్రశ్న ఇప్పుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది.**

**కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి :**

### జీవోలను తుంగలో తొక్కి ర్యాంపులకు గ్రీన్‌సిగ్నల్..?

గుండ్లసింగారం, కొమ్ముగూడెం, శివాజీనగర్ గ్రామాల ప్రజలను సింగరేణి విస్తరణ కోసం గతంలో పూర్తిగా తరలించిన విషయం అధికారిక రికార్డుల్లోనే ఉంది. అలాంటి ప్రాంతాల్లో రైతులు ఉన్నట్లు, గిరిజనులకు ఉపాధి కల్పిస్తున్నట్లు కాగితాలపై చూపించి జిల్లా యంత్రాంగాన్ని నమ్మించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలే లేని చోట రైతు సంఘాలు ఎలా ఏర్పడ్డాయి? రైతులే లేని చోట గిరిజన సొసైటీలు ఎలా నమోదయ్యాయి? అనే ప్రశ్నలకు సమాధానం లేకుండానే అనుమతులు మంజూరు కావడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ జీవోలను పక్కనబెట్టి, వాస్తవ పరిస్థితులను దాచిపెట్టి ర్యాంపులకు అనుమతులు ఇచ్చారనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. జిల్లా యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించి ప్రభుత్వ భూములనే ప్రైవేటు దోపిడీకి వేదికగా మార్చారనే ఆరోపణలు ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి.

### ఆంధ్ర కాంట్రాక్టర్లతో మూడు శాఖల కుమ్మక్కు..?

ఈ వ్యవహారం వెనుక ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇసుక కాంట్రాక్టర్ల హస్తం ఉందని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు కళ్లుమూసుకుని పూర్తి సహకారం అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పగటిపూట అనుమతుల పేరుతో... రాత్రివేళల్లో 'జీరో లారీల' పేరుతో 24 గంటలూ ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోందని చెబుతున్నారు. లెక్కల ప్రకారం ఒక్కో ర్యాంపులో సుమారు 30 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వ ఉందని, దాని మార్కెట్ విలువ సుమారు రూ.1,800 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. కానీ ఈ భారీ ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరకుండా ప్రైవేటు కాంట్రాక్టర్లు, వారికి సహకరిస్తున్న అధికారుల చేతుల్లోకి వెళ్తోందని ఆరోపిస్తున్నారు. టీజీఎండీసీ, మైనింగ్, ఇరిగేషన్ శాఖల కొందరు అధికారులకు 5 శాతం వాటా అందుతోందనే ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై ఇప్పటివరకు అధికారిక స్పందన మాత్రం లేదు.

### లేని గ్రామాల పేరుతో నకిలీ సొసైటీలు..?

ఈ వ్యవహారంలో అత్యంత సంచలన అంశం నకిలీ సొసైటీల వ్యవహారమే. గుండ్లసింగారం, కొమ్ముగూడెం, శివాజీనగర్ గ్రామాల్లో ప్రస్తుతం ఒక్క కుటుంబం కూడా నివసించడం లేదు. అలాంటప్పుడు ఆ గ్రామాల పేరుతో గిరిజన సొసైటీలు ఎలా ఏర్పడ్డాయి? అనే ప్రశ్న అందరినీ కలవరపెడుతోంది. స్థానిక గిరిజన రైతుల పేరుతో కాకుండా, ఇతర ప్రాంతాల వ్యక్తులను సభ్యులుగా చూపించి నకిలీ సొసైటీలు సృష్టించారనే ఆరోపణలు వస్తున్నాయి. కాగితాలపై మాత్రం పూర్తిగా గిరిజనుల సొసైటీగా చూపించి ప్రభుత్వాన్ని నమ్మించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గిరిజనుల ఉపాధి పేరుతో కోట్ల రూపాయల ఇసుకను కొద్దిమంది వ్యక్తులు దోచుకుంటున్నారని మండిపడుతున్నారు. ఈ సొసైటీల వెనుక ఎవరు ఉన్నారు? ఎంత మొత్తం చేతులు మారింది? అనేదానిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

### జీరో లారీల దందాకు పోలీసులే సాక్ష్యం

మణుగూరులో అక్రమ ఇసుక రవాణా ఏ స్థాయిలో జరుగుతోందో ఇటీవల పట్టుబడ్డ లారీ వ్యవహారం స్పష్టం చేస్తోందని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం రాత్రి TS 28 T 6489 నంబర్ గల అశ్వాపురానికి చెందిన లారీ అక్రమంగా జీరో ఇసుక తరలిస్తుండగా మణుగూరు పోలీసులు పట్టుకున్నారు. ఇదే లారీ కొన్ని రోజుల క్రితం సీతారామ ప్రాజెక్టు పరిధిలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండగా కూడా పట్టుబడిందని సమాచారం. అప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే మళ్లీ అదే లారీ ఇసుక దందాలో పట్టుబడేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఒకే వాహనం వరుసగా అక్రమ రవాణాలో చిక్కుకోవడం వెనుక ఎవరి అండ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### తహసీల్దార్ వివరణ ఇలా..

ఈ వ్యవహారంపై మణుగూరు తహసీల్దార్ స్పందిస్తూ గుండ్లసింగారం, కొమ్ముగూడెం, శివాజీనగర్ ప్రాంతాలు గతంలోనే సింగరేణి పరిధిలోకి వెళ్లాయని, ప్రస్తుతం అక్కడ ప్రజలు ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఆ ప్రాంతాల్లోని ఇసుక ర్యాంపులకు తాను అనుమతులు ఇవ్వలేదని, గత తహసీల్దార్ హయాంలోనే అనుమతులు వచ్చాయని తెలిపారు. ఇటీవల పద్మగూడెం ర్యాంపుకు అనుమతి కోరుతూ వచ్చిన ఓ కాంట్రాక్టర్ తనను డబ్బులతో ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించాడని, "మీకు ఎంత కావాలంటే అంత ఇస్తా... సంతకం చేయండి" అని ఒత్తిడి తెచ్చాడని ఆరోపించారు. అనుమతి నిరాకరించడంతో తనపై నిరాధార ఆరోపణలు చేశాడని కూడా చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అదే కాంట్రాక్టర్ ఓ కేసులో జైలుకు వెళ్లిన విషయాన్ని కూడా ప్రస్తావించారు. మరోవైపు మణుగూరు మున్సిపాలిటీ అధికారులు గుండ్లసింగారం, పద్మగూడెం, కొమ్ముగూడెం, శివాజీనగర్ ప్రాంతాలు మున్సిపల్ పరిధిలో ఉన్నప్పటికీ అక్కడ ప్రస్తుతం ఎలాంటి నివాసాలు లేవని స్పష్టం చేశారు. ఇసుక ర్యాంపులకు మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేదా ఎన్ఓసీలు ఇవ్వలేదని వెల్లడించారు. గుండ్లసింగారం, పద్మగూడెం, కొమ్ముగూడెం, శివాజీనగర్ ప్రాంతాల్లోని ర్యాంపులకు అనుమతులు ఉన్నాయా? పోలీసులకు పట్టుబడ్డ జీరో ఇసుక లారీపై టీజీఎండీసీ ప్రాజెక్టు అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ (మైనింగ్)ల వివరణ ఏమిటి? అనే అంశాలపై స్పందన కోసం ప్రయత్నించినప్పటికీ వారు ఫోన్‌కు స్పందించకపోవడం గమనార్హం. ఇసుక దందాపై ఒకవైపు తీవ్ర ఆరోపణలు... మరోవైపు సంబంధిత శాఖల మౌనం... లేని గ్రామాలకు ర్యాంపుల అనుమతులు... నకిలీ సొసైటీల ఆరోపణలు... రాత్రివేళ్ల జీరో లారీల అక్రమ రవాణా... ఇవన్నీ కలిసి మణుగూరులో జరుగుతున్న ఇసుక వ్యవహారంపై సమగ్ర, ఉన్నతస్థాయి విచారణ జరపాల్సిన అవసరాన్ని బలంగా చాటుతున్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవాలు ఏ మేరకు ఉన్నాయో ప్రభుత్వం తేల్చాల్సిన అవసరం ఉందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



పోలీసులు పట్టుకున్న జీరో ఇసుక లారీ...

## సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

- విద్యార్థులకు అవగాహన కల్పించిన గుండాల పోలీసులు
- మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచన

కాకతీయ, గుండాల : సైబర్ నేరాల నుంచి రక్షణ పొందాలంటే అవగాహనే ప్రధాన ఆయుధమని గుండాల సీఐ తిరుపతి అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో భాగంగా గుండాల ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు బుధవారం సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కేవైసీ, డిజిటల్ అరెస్ట్, డీప్‌ఫేక్, పెట్టుబడులు, ఫేక్ లింకు లు, సోషల్ మీడియా నకిలీ ప్రొఫైళ్ల ద్వారా జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ, బ్యాంకు వివరాలు, యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయొద్దని హెచ్చరించారు. పోలీసుల పేరుతో ఫోన్ చేసి డబ్బులు లేదా వ్యక్తిగ త వివరాలు అడిగితే నమ్మవద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రవణ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## వేణుకుమార్‌కు మరోసారి అండగా నామా

### డిశ్చార్జ్ బిల్లు మాఫీ చేయించిన మాజీ ఎంపీ
### ఇప్పటికే రూ.50 వేల సాయం.. కుటుంబానికి భరోసా



కాకతీయ, ఖమ్మం టౌన్ : గ్రూప్స్ నోటిఫికేషన్ల జాప్యంపై మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి. వేణుకుమార్ ఆస్పత్రి నుంచి సోమవారం డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మరోసారి అండగా నిలిచారు. ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి వేణుకుమార్ డిశ్చార్జ్ బిల్లును మాఫీ చేయించారు. ఇప్పటికే నామ ట్రస్ట్ తరపున వేణుకుమార్‌కు రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన నామా నాగేశ్వరరావు, కుటుంబంపై అదనపు భారం పడకుండా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వేణుకుమార్‌కు సకాలంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ కేసోజు భారత్ బాబు, వైద్య బృందం, నర్సింగ్ సిబ్బందిని అభినందించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం వేణుకుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా నామా నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. వేణుకుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నామ, ధైర్యంగా జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. పూర్తిగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. నిరుద్యోగ యువత ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యల వంటి నిర్ణయాలకు పాల్పడవద్దని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని విజ్ఞప్తి చేశారు.

## సబ్సిడీపై రైతులకు విద్యుత్ మోటార్ల పంపిణీ



కాకతీయ, గుండాల : జలగం వెంగళరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై 16 విద్యుత్ మోటార్లను బుధవారం పంపిణీ చేశారు. గుండాల సర్పంచ్ కోరం సీతారాములు లబ్ధిదారులకు మోటార్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంత రైతులకు ట్రస్ట్ అందిస్తున్న సహాయం అభినందనీయమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధి సాధించాలని కోరారు. గోవింద నరసింహారావు మాట్లాడుతూ, జలగం ప్రసాదరావు సారథ్యంలో ట్రస్ట్ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో పాటు సబ్సిడీపై మోటార్లు అందించడం రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ఈసం కృష్ణ, బొబ్బిలి సమ్మయ్య, గడ్డం సమ్మయ్య, గడ్డం కృష్ణ, గుర్రం రాములు, నిట్ట వెంకన్న, ఎస్.డి. కుద్దూస్, ఈసం సమ్మయ్య, తౌడుశెట్టి నాగరాజు తదితర రైతులు పాల్గొన్నారు.

## వీబీ–జీ రామ్‌జీ ఉద్యోగుల పెన్‌డౌన్



కాకతీయ, చింతకాని: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం వీబీ–జీ రామ్‌జీ (ఎస్ఆర్‌డీఎస్) స్థిరకాల ఉద్యోగులు చేపట్టిన పెన్‌డౌన్ ఉద్యమం బుధవారానికి ఐదో రోజుకు చేరుకుంది. చింతకాని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన ఉద్యోగులు అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. వేతన శ్రేణి అమలు, క్యాడర్ ఖరారు, పారదర్శక బదిలీలు, పదోన్నతులు, పెండింగ్ వేతనాల విడుదల, స్థిరకాల ఉద్యోగులను శాశ్వతీకరించడం, వీబీ–జీ రామ్‌జీ ఉద్యోగులందరికీ ఎఫ్‌టీఈ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు.

## సైబర్ మోసాలకు అప్రమత్తతే కవచం

### విద్యార్థులకు అవగాహన కల్పించిన సీపీ సునీల్ దత్
### ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దని సూచన



కాకతీయ, ఖమ్మం : సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత, అవగాహనే ప్రధాన ఆయుధమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం నగరంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన 'సురక్షా కా తిరంగా–సైబర్ స్వతంత్ర తెలంగాణ' అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో సైబర్ మోసాలు కూడా అధికమవుతున్నాయని పేర్కొన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్, సీవీవీ వంటి గోప్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని, ప్రతి ఖాతాకు వేర్వేరు బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించాలని, రెండు దశల భద్రతా ధృవీకరణ తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. డిజిటల్ అరెస్ట్, పెట్టుబడుల పేరుతో మోసాలు, డీప్‌ఫేక్‌లు, నకిలీ యాప్‌లు, క్యూఆర్ కోడ్ మోసాలు, ఉద్యోగాల పేరుతో మోసాలు ఇటీవల పెరిగాయని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## నేటి నుంచి కొత్త విధానంలో ఎరువుల విక్రయాలు

కాకతీయ, కారేపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్ ద్వారా బుధవారం నుంచి అన్ని ఎరువుల విక్రయాలు చేపడుతున్నట్లు వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ తెలిపారు. కారేపల్లిలో ఎరువుల దుకాణాలు, సొసైటీ విక్రయ కేంద్రాలను తనిఖీ చేసిన ఆమె మాట్లాడుతూ, రైతులు ఆధార్ లేదా ఫార్మర్ ఐడీతో యాప్‌లో లాగిన్ అయి ఎరువులను బుక్ చేసుకోవాలని సూచించారు. పట్టా లేని రైతులు, కౌలుదారులు ఎన్‌డీఎస్ విధానంలో మొబైల్ నంబర్‌తో నమోదు చేసుకోవచ్చన్నారు. బుకింగ్ ఐడీ లేదా క్యూ ఆర్ కోడ్ ఆధారంగా ఎరువులు అందజేస్తామని తెలిపారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తతే శ్రీరామరక్ష

- చేర్యాలలో పోలీసుల అవగాహన ర్యాలీ
- ఓటీపీ, బ్యాంకు వివరాలు పంచుకోవద్దని సూచన



కాకతీయ, చేర్యాల : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే మోసాల నుంచి రక్షణ పొందవచ్చని పోలీసులు సూచించారు. 'సురక్షా తిరంగా సైబర్' కార్యక్రమంలో భాగంగా బుధవారం చేర్యాల పట్టణంలో జాతీయ రహదారిపై వివిధ కళాశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాసవి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ మోసాల తీరుతెన్నులను వివరించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ర్యాలీలో సీఐ బానోత్ రమేష్ నాయక్, ఎస్ఐలు అపూర్వ రెడ్డి, మహేష్, ఆశీఫ్, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం



కాకతీయ, కరీంనగర్: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామంలో సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. గ్రామ సర్పంచ్ దీకొండ లక్ష్మి భర్త దీకొండ మధు గ్రామసభ అనంతరం ఇంట్లో మాత్రలు అధిక మోతాదులో తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన ఆయనను వెంటనే కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, నారాయణపూర్ ముంపు గ్రామం అంశంపై సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపుల్లో తమ కుటుంబంపై జరుగుతున్న విమర్శలు, ప్రచారాల కారణంగా మధు తీవ్ర మనస్తాపానికి గురై ఈ చర్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మహిళా సంఘాలే గ్రామీణాభివృద్ధికి వెన్నెముక

- సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మర్రిగడ్డలో మహిళా భవనం, వాటర్ ప్లాంట్ ప్రారంభం



కాకతీయ, చందుర్తి : మహిళల ఆర్థికాభివృద్ధి, సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో మహిళా సమైక్య భవనం, రూ.3 లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించి, అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా సంఘాలకు శాశ్వత భవనాలు నిర్మించడంతో పాటు రూ.20 లక్షల వరకు రుణాలు, వడ్డీ రాయితీలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల రుణాలు అందజేస్తున్నామని చెప్పారు. రైస్ మిల్లులు, సోలార్ ప్రాజెక్టులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ వంటి అవకాశాలను మహిళా సంఘాలకు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మర్రిగడ్డ గ్రామంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, పల్లె దవాఖాన, రహదారులు, బోరు బావి, మరో మహిళా సంఘ భవనానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి భారీ నిధులు తీసుకొచ్చామని, గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి కొనసాగుతుందని తెలిపారు.

## పీఎం కిసాన్‌కు మరో ఐదేళ్ల పొడిగింపు

**2030-31 వరకు కొనసాగనున్న పెట్టుబడి సాయం**

**కొత్త పట్టాదారులకు ఇంకా అందని లబ్ధి**



కాకతీయ, కరీంనగర్ : రైతులకు పెట్టుబడి సాయంగా అందిస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2030–31 ఆర్థిక సంవత్సరం వరకు మరో ఐదేళ్లు పొడిగించింది. ఇందుకోసం రూ.3.15 లక్షల కోట్ల వ్యయానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 2.24 లక్షల మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. అర్హులైన ప్రతి రైతుకు ఏడాదికి రూ.6,000 చొప్పున మూడు విడతల్లో నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. పథకం పొడిగించినా 2019 తర్వాత భూములు కొనుగోలు చేసిన రైతులు, కుటుంబ విభజనతో కొత్త పట్టాదారులుగా నమోదైన వారికి పీఎం కిసాన్ వర్తింపుపై స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కొత్త నమోదులకు పోర్టల్‌లో అవకాశం లేకపోవడం, ఈ–కేవైసీ, ఆధార్ సీడింగ్, భూ రికార్డుల అనుసంధానంలో సాంకేతిక సమస్యలతో వేలాది మంది రైతులు పథకానికి దూరమయ్యారు. కొత్త నమోదులు ప్రారంభించి, అర్హులైన రైతులందరికీ పీఎం కిసాన్ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# సీఎంఆర్ దందాలో పెద్ద చేపలెవరు..?

**చిన్న మిల్లులకే ఉచ్చు.. బడా మిల్లర్లకు మినహాయింపా..?**

**టార్గెట్‌గా చేసుకుని విజిలెన్స్ దాడులు జరుగుతున్నాయా..?**

**బకాయిలున్న మిల్లర్లకే మళ్లీ ధాన్యం కేటాయింపులా..?**

**స్టాక్ లెక్కలు, సీఎంఆర్ బియ్యంపై సమగ్ర విచారణకు డిమాండ్**



కాకతీయ, కరీంనగర్ : కరీంనగర్ జిల్లాలో సీఎంఆర్ బియ్యం వ్యవహారం మరోసారి కలకలం రేపుతోంది. ప్రభుత్వ ధాన్యం మిల్లింగ్ ప్రక్రియలో చోటుచేసుకున్న అక్రమాలపై విజిలెన్స్ దాడులు జరుగుతున్నప్పటికీ, ఆ చర్యలు అందరికీ సమానంగా అమలవుతున్నాయా? లేక కొందరికే పరిమితమయ్యాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. చిన్న రైస్ మిల్లులపైనే కేసులు నమోదు చేస్తూ, భారీ స్థాయిలో సీఎంఆర్ నిర్వహించిన బడా మిల్లర్ల వ్యవహారంపై అదే స్థాయిలో దృష్టి సారించలేదనే ఆరోపణలు జిల్లాలో చర్చకు దారితీశాయి. దీంతో మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలనే డిమాండ్ బలపడుతోంది.

### బకాయిలున్నా... మళ్లీ కేటాయింపులా..?

గత సీజన్‌ల సీఎంఆర్ బకాయిలు, పెనాల్టీలు, వివాదాలు ఉన్నప్పటికీ కొందరు మిల్లర్లకు మళ్లీ ప్రభుత్వ ధాన్యం కేటాయింపులు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం బకాయిలు పూర్తిగా చెల్లించిన తర్వాతే కొత్త కేటాయింపులు జరగాల్సి ఉండగా, ఆ ప్రక్రియను పూర్తిగా పాటించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బ్యాంకు గ్యారంటీలు, అర్హత ప్రమాణాలు, ఒప్పంద నిబంధనల అమలుపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని రైస్ మిల్లుల్లో రికార్డుల్లో చూపిన ధాన్యం నిల్వలకు, వాస్తవ స్టాక్‌కు మధ్య వ్యత్యాసాలున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎంఆర్ బియ్యం నిల్వలు, రవాణా వివరాలు, గోదాముల లెక్కలను సమగ్రంగా పరిశీలిస్తే అసలు పరిస్థితి బయటపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా ధాన్యం తరలింపు, రికార్డుల నిర్వహణలో లోపాలపై కూడా లోతైన విచారణ అవసరమని పలువురు కోరుతున్నారు.

### అందరికీ ఒకే న్యాయం ఉండాలి

అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా చట్టం ముందు సమానమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. చిన్న మిల్లులపై మాత్రమే చర్యలు తీసుకుని, పెద్ద మిల్లర్లను వదిలేస్తే విచారణపై అనుమానాలు పెరుగుతాయని చెబుతున్నారు. జిల్లాలోని అన్ని రైస్ మిల్లులను ఒకే ప్రమాణంతో తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సమానంగా చర్యలు తీసుకుంటేనే ప్రభుత్వానికి నష్టం చేసిన అసలు బాధ్యులు బయటపడతారని అభిప్రాయపడుతున్నారు. సీఎంఆర్ బియ్యం వ్యవహారంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా జిల్లాలోని అన్ని మిల్లులపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని, గత మూడు సీజన్‌ల ధాన్యం కేటాయింపులు, సీఎంఆర్ బకాయిలు, స్టాక్ రికార్డులు, బ్యాంకు గ్యారంటీలను సమగ్రంగా పరిశీలించాలని రైతు సంఘాలు, మిల్లింగ్ రంగానికి చెందిన పలువురు కోరుతున్నారు. సమగ్ర విచారణ ద్వారానే ఆరోపణలకు తెరపడుతుందని, ప్రభుత్వ ధాన్యం నిర్వహణలో పారదర్శకతకు భరోసా లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

## ఏఐ ఎంట్రీతో బోగస్ మస్టర్ల గుట్టురట్టు అవుతుందా..?

**ఉపాధి పనుల్లో అక్రమాలపై డిజిటల్ ఉక్కుపాదం**

**జియో ట్యాగ్ ఫొటోలతో కూలీల హాజరుపై నిఘా**

**పనులు చేయకుండానే బిల్లులు.. తప్పుడు మస్టర్లకు చెక్**

**తేడాలు తేలితే రికవరీతో పాటు క్రిమినల్ కేసులు**



కాకతీయ, కరీంనగర్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) అమలులో ఎన్నాళ్లుగానో వినిపిస్తున్న బోగస్ మస్టర్లు, నకిలీ హాజరు, పనులు చేయకుండానే బిల్లుల చెల్లింపుల ఆరోపణలకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం కృత్రిమ మేధ (ఏఐ)ను రంగంలోకి దించింది. కూలీల హాజరు నుంచి పనుల పురోగతి వరకు ప్రతి అంశాన్ని ఏఐ విశ్లేషించనుండటంతో, ఇప్పటివరకు దాగి ఉన్న అక్రమాలు బయటపడతాయా? అనే చర్చ మొదలైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో లక్షలాది మంది కూలీలు ఉపాధి హామీ పథకంలో నమోదై ఉన్నారు. ప్రతిరోజూ పనిస్థలాల్లో తీసే జియో ట్యాగ్ ఫొటోలను ఏఐ పరిశీలించి, హాజరు, పనుల పురోగతి, స్థల వివరాలను సరిపోల్చనుంది. ఒకే వ్యక్తి పేరు పలుచోట్ల నమోదు కావడం, పనిస్థలంలో లేకుండానే హాజరు చూపించడం, వాస్తవ పనికి మించిన బిల్లులు నమోదు చేయడం వంటి అంశాలు తేలితే వెంటనే గుర్తించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

### అక్రమాలకు చెక్ పడుతుందా..?

గతంలో పలు ప్రాంతాల్లో బోగస్ మస్టర్లు, పనులు పూర్తి కాకుండానే బిల్లులు, నకిలీ కొలతలపై ఆరోపణలు వినిపించాయి. ఇప్పుడు ఏఐ వ్యవస్థ అమలుతో అలాంటి అవకతవకలను గుర్తించడం సులభమవుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే కేవలం సాంకేతికతను ప్రవేశపెట్టడం సరిపోదని, ఏఐ గుర్తించిన లోపాలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటేనే ఫలితం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏఐ విశ్లేషణలో నకిలీ హాజరు, తప్పుడు బిల్లులు, బోగస్ చెల్లింపులు లేదా ఇతర అవకతవకలు బయటపడితే ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని రికవరీ చేయడంతో పాటు సంబంధిత అధికారులపై, బాధ్యులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో ఉపాధి హామీ పనుల అమలులో పారదర్శకత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### అసలు పరీక్ష అమలులోనే..!

ఏఐ వ్యవస్థ ప్రవేశంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందా? లేక కొత్త విధానాన్ని కూడా దాటవేసే మార్గాలను కొందరు వెతుకుతారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో నమోదైన ఫిర్యాదులు, పెండింగ్ విచారణలు, రికవరీ కేసులను కూడా ఏఐ ఆధారిత విశ్లేషణతో అనుసంధానిస్తే ఉపాధి హామీ పథకంలో ఉన్న బోగస్ వ్యవస్థ పూర్తిగా బయటపడే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

## బీజేపీ విధానాలపై 14 వరకు సీపీఐ ప్రచార యాత్ర

**పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**



కాకతీయ, కరీంనగర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 14 వరకు జిల్లావ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు ప్రచార యాత్ర నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డితో కలిసి ప్రచార యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నికల హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్య, వైద్య రంగాల్లోని ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించడమే యాత్ర లక్ష్యమన్నారు. ఆగస్టు 6న కరీంనగర్ పద్మనగర్‌లో ప్రారంభమయ్యే యాత్రలో సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పాల్గొంటారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**ఎగువ మానేరు వద్ద పూజలు చేసిన కేకే మహేందర్‌రెడ్డి**

**నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కేటీఆర్‌కు సూచన**



కాకతీయ, గంభీరావుపేట : కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న పార్టీ అని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎగువ మానేరు జలాశయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ఎగువ మానేరు నిండుకుండలా మారడం ఆనందదాయకమన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం కాదని, అది అంతకుముందే నిర్మించబడిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా మానేరు జలకళ సంతరించుకుందని చెప్పారు. మిడ్ మానేరు నుంచి గాయత్రీ పంప్‌హౌస్, మూలవాగు, నిమ్మపల్లి వాగు ద్వారా నీరు వస్తోందని, త్వరలో అప్పర్ మానేరు మత్తడి దూకి దిగువ ప్రాంతాల చెరువులు నిండుతాయని తెలిపారు. దీంతో సాగు, తాగునీటి సమస్యలు తీరనున్నాయని అన్నారు. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని, 9వ ప్యాకేజీ పూర్తయి ఉంటే ప్రాంతం మరింత అభివృద్ధి చెందేదని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమ భూమిలో సబ్‌స్టేషన్‌కు మళ్లీ వివాదం

- ఎమ్మెల్యే, తహశీల్దార్ హామీ అమలు కాలేదని ట్రస్ట్ సభ్యుల ఆవేదన
- ఆశ్రమ ప్రాంగణంలోనే దీక్ష.. ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక



కాకతీయ, చందుర్తి : రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేటలో చార్వాక వృద్ధాశ్రమానికి కేటాయించిన ఐదెకరాల భూమిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ట్రస్ట్ సభ్యులు, వృద్ధులు మరోసారి ఆందోళన చేపట్టారు. ఆశ్రమ ప్రాంగణంలోనే దీక్షకు దిగిన వారు, గతంలో ఇచ్చిన హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. ట్రస్ట్ సభ్యుల కథనం ప్రకారం, 2017లో వృద్ధాశ్రమం కోసం ఐదెకరాల భూమి కేటాయించారు. గత మేలో అదే స్థలంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి అధికారులు హద్దులు పాతే ప్రయత్నం చేయడంతో ఆందోళన చేపట్టగా, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచనల మేరకు తహశీల్దార్ అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టబోమని, భూమికి హద్దులు నిర్ణయించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో అప్పట్లో దీక్ష విరమించారు. అయితే, ఇటీవల అధికారులు మళ్లీ జేసీబీలతో వచ్చి బోరు తవ్వేందుకు ప్రయత్నించారని ట్రస్ట్ సభ్యులు ఆరోపించారు. గ్రామంలో 20 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నప్పటికీ వృద్ధాశ్రమ స్థలాన్నే లక్ష్యంగా చేసుకోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని విమర్శించారు. హామీ అమలు చేసి వృద్ధాశ్రమ భూమిని పరిరక్షించాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ట్రస్ట్ సభ్యులు హెచ్చరించారు.

## వరదపై అప్రమత్తంగా ఉండాలి

**మత్తడి దూకితే వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేయాలి**

**ఎగువ మానేరు పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**



కాకతీయ, గంభీరావుపేట : ఎగువ మానేరు జలాశయంలోకి వరద నీరు చేరుతున్న నేపథ్యంలో నీటిపారుదల, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ మహేష్ బి.గితేతో కలిసి జలాశయాన్ని పరిశీలించిన ఆమె, నీటిమట్టం, వరద ప్రవాహంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 2 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.6 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు వివరించారు. వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యం లో నీటిమట్టాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలు, రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ అప్రమత్తం చేయాలని కలెక్టర్ సూచించారు. మత్తడి దూకే పరిస్థితి ఏర్పడితే వెంటనే బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ శ్రీధర్ బాబు, నీటిపారుదల శాఖ అధికారులు దయాకర్, ప్రశాంత్, తహసీల్దార్ మారుతిరెడ్డి పాల్గొన్నారు.